సాక్షి
నారాయణపేట
శుక్రవారం : 2 : మే : 2025



నీట్‌కు ఏర్పాట్లు

జిల్లాలో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



రైతుల కష్టాలు పట్టవా..?

ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు అమ్మకంలోనూ కష్టాలు తప్పడం లేదు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /24.2

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అదే క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకాంక్షించారు. పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు. ఆమెతోపాటు అడిషనల్ కలెక్టర్ గంగ్వార్, డీఈఓ గోవిందరాజులు, మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రషీద్ శాలువాతో సత్కరించారు. పదిలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు విశ్లేషించుకోవాలని, సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు ఇప్పటి నుంచి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖాజా మహబూబ్ ఖాన్, మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే వనపర్తికి ఈఎస్‌ఐ ఆస్పత్రి



వనపర్తి టౌన్: కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు త్వరలోనే వనపర్తి జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మేడే సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పుర కార్మికులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను కడుపులో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో లక్షలాది మందికి నిరంతరాయంగా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు ప్రశంసనీయమన్నారు. సిబ్బంది కొరత తీర్చేందుకు కొత్త నియమకాలను చేపడతామన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం కార్మికులకు ప్రతి బెనిఫిట్‌ను అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు విజయ చందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, లైట్, హెవీ వెహికల్స్ సంఘం అధ్యక్షులు అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

వనపర్తి విద్యావిభాగం: ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య గురువారం ఇంటర్మీడియట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేశారని డీఐఈఓ ఎర్ర అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందడానికి మొదటి విడత ప్రక్రియ మే 1 నుంచి ప్రారంభం కాగా జూన్ 30న ముగుస్తుందన్నారు. జూన్ 2 నుంచి కళాశాలలు పునఃప్రారంభమవుతాయని, అదే రోజు నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారన్నారు. కళాశాలలో చేరే విద్యార్థులు ఇంటర్నెట్ మెమోతో అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు.

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

పాలమూరు: దేశ ప్రగతికి కులగణన పునాది వంటిదని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణనతో పాటు జనగణనను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అభివృద్ధి అంటే ఆర్థిక అసమానతలను తొలగించడమే అని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తూ.. కులగణన గురించి ఆలోచించలేదని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు వద్దని చెప్పినా ముస్లింలను కూడా బీసీల కింద గుర్తించి కులగణన లక్ష్యాన్ని తారుమారు చేసిందని విమర్శించారు. దేశం మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ఈ కులగణన కీలకమైనదని వ్యాఖ్యానించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు, మాజీ కౌన్సిలర్ చెన్నవీరయ్య, నంబి రాజు, నాగరాజు, పిల్లి సూర్యనారాయణ, కొకుంట్ల ఆంజనేయులు, సుదర్శన్‌గౌడ్, మనోహర్ పాల్గొన్నారు.

విస్తృత అవగాహన

'భూ భారతి' పైలెట్ మండలం మద్దూరులో ముగిసిన రెవెన్యూ సదస్సులు



చెన్నారెడ్డిపల్లిలో అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సు

- రైతుల నుంచి 1,341 దరఖాస్తుల స్వీకరణ
- సర్వే నెంబర్ తప్పిదాలు, విస్తీర్ణం సమస్యలే అధికం..
- పరిష్కారానికి ప్రత్యేక టీంలు
- జిల్లాలోని మిగితా మండలాల్లో కొనసాగుతున్న అవగాహన సదస్సులు

మద్దూరు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న ధరణి చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వం కొత్తగా భూ భారతిని ప్రవేశపెట్టిన విషయం విధితమే. తద్వారా పరిష్కారమయ్యే సమస్యలు, దరఖాస్తు విధానాన్ని వివరించేందుకు ప్రతి మండలంలో అవగాహన సదస్సులు కలెక్టర్ స్థాయిలో నిర్వహిస్తున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడమేగాక వారి నుంచి దరఖాస్తులు, సూచనలు సైతం స్వీకరిస్తున్నారు. జిల్లాలో పైలెట్ మండలంగా ఎంపికైన మద్దూరు మండలంలో గత నెల 28 వరకు రెవెన్యూ గ్రామాల్లో భూ భారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కూడా అవగాహన సదస్సులు నిర్వహించారు.

17 రెవెన్యూ గ్రామాలు.. 1,341 దరఖాస్తులు

భూ భారతి చట్టం అమలు కోసం జిల్లాలోని మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఏప్రిల్ 17న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని ఖాజీపూర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఏప్రిల్ 28 వరకు మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ టీంలు గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి ఆయా సమస్యలపై దరఖాస్తులు తీసుకున్నారు. మండలం మొత్తంగా 1341దరఖాస్తులు రాగా అందులో ప్రధానంగా సర్వే నెంబర్ తప్పిదాలు 491, విస్తీర్ణం సమస్యలు 231, సాదాబైనామా 113, అసైన్డ్ భూమి సమస్యలు 95, సర్వే సబ్‌డివిజన్ సమస్యలు 50, నిషేధిత భూ సమస్యలు 28, తదితర వాటిపై అధికారులకు దరఖాస్తులు అందేశారు.

పరిష్కారానికి ప్రత్యేక టీంలు

భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్టుగా మద్దూరు మండలానికి ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు విభజించి వాటి పరిష్కార మార్గాల తెలుసుకునేందుకు మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో కోస్గి, కొత్తపల్లి, మరికల్, ఆర్డీఓ కార్యాలయ తహసీల్దార్ మొత్తంగా నాలుగు టీంలు ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వీటిపై ఎప్పటికప్పుడు కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషన్ కలెక్టర్ బెన్‌షాలోం, ఆర్డీఓ రాంచందర్ వీరితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్డీఓ స్థాయిలో ఈ భూ సమస్యలపై నోటీసులు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల కోసం మద్దూరు మండలానికి ప్రత్యేకాధికారిగా యాదగిరిని నియమించారు.

త్వరలో నోటీసులు జారీ చేస్తాం



ఇన్నేళ్లుగా నెలకొన్న సమస్యలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం కానున్నాయి. ఇప్పటి వరకు భూభారతి చట్టంపై జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం. మద్దూరు మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశాం. త్వరలో నోటీసులు జారీ చేస్తాం. మిగితా మండలాల్లో జూన్ 2 తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుంది.

– రాంచందర్‌నాయక్, ఆర్‌డీఓ, నారాయణపేట

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి



మద్దూరులో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూరు: భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చట్టం ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరకాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేసి, విరాసత్, హద్దు సమస్యలు, అసైన్డ్, పేరు మార్పిడి, అన్నదమ్ముల బాగ పరిష్కారం లాంటి సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో అధికారుల బృందం కొత్త చట్టం ద్వారా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాన్ని కలెక్టర్ సూచించారు. ఈ దరఖాస్తుల పరిశీలన కోసం మద్దూరు, కోస్గి, మరికల్, నారాయణపేట ఆర్డీఓ కార్యాలయ తహసీల్దార్ల బృందం దరఖాస్తుల వారీగా పేపర్ వర్క్‌తో పాటు సమస్యలను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలు ఎంత వరకు వచ్చాయని ఆర్డీఓ రాంచందర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, తహసీల్దార్ అనిల్‌కుమార్, టీడీ వాసుదేవరావ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పాలమూరే మా ప్రాధాన్యం



పాలమూరు ప్రాజెక్టు ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం

- ఏడాదిలో కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వందశాతం..
- రెండేళ్లలోనే పాలమూరు– రంగారెడ్డి ద్వారా ఉదండాపూర్‌కు నీళ్లు
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసంపూర్తిగా ఉన్న కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పనులను ఏడాదిలోనే వంద శాతం పూర్తిచేస్తామని, రెండేళ్లలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులను సైతం పూర్తి చేసి.. ఉదండాపూర్ రిజర్వాయర్ వరకు నీటిని అందిస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డితో కలిసి గురువారం పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, పనుల పురోగతిని పరిశీలించారు.

40 వేల క్యూసెక్కులు తరలిస్తేనే..

పాలమూరులో భాగంగా నార్లాపూర్ వద్ద చేపట్టిన పంప్‌హౌస్, మోటార్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. కృష్ణాతీరంలోని కోతిగుండు వద్ద ఏర్పాటు చేసిన ఇన్‌టేక్, అప్రోచ్ కెనాల్, హెడ్‌రెగ్యులేటరీ పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి సమీక్షించారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల వైపు వెళ్లే అప్రోచ్ కెనాల్ 6.5 కి.మీ., వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. భూ సేకరణ, కోర్టు కేసుల నేపథ్యంలో అక్కడ కాల్వ తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆరు నెలల్లోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని, అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి చెప్పారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతలలో భాగమైన ఏదుల పంప్‌హౌస్‌లోని మోటార్లను పరిశీలించారు. మోటార్ల రిపేరు త్వరగా పూర్తిచేయాలని, పూర్తిస్థాయి సామర్థ్యం 5 మోటార్లను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 40 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తేనే ప్రాజెక్ట్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం పాలమూరు– రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను, వట్టెం పంప్‌హౌస్‌ను సందర్శించారు. సొరంగం లోపల గతంలో నీట మునిగిన వట్టెం పంప్‌హౌస్‌ను అధికారులు పునరుద్ధరించారు. ఇప్పటి వరకు నాలుగు మోటార్లను బిగించగా, మరో మోటారు బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగు నెలల్లోగా మోటార్ల బిగింపు, ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ రాంమోహన్ రావు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

2027 మార్చి కల్లా..

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులను సైతం 2027 మార్చికల్లా పూర్తిచేసి ఉదండాపూర్ వరకు నీటిని అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద ఏదుల వద్ద పంప్‌హౌస్‌లో ప్రస్తుతం రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయని, పూర్తిస్థాయిలో ఐదు మోటార్లతో నీటి ఎత్తిపోతలకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మోటార్ల మరమ్మతు మూడు నెలల్లోగా పూర్తిచేసి వచ్చే వానాకాలంలో ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. పాలమూరు, కల్వకుర్తి ఎత్తిపోతల పెండింగ్ పనులు, భూసేకరణ, పునరావాస కాలనీల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్నారు. పాలమూరు– రంగారెడ్డి కింద గతంలో కేసీఆర్ ఒక్క మోటారు ఆన్ చేసి హడావుడి చేశారని, అది తాత్కాలికంగా చేసిన ఏర్పాటేనని విమర్శించారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ సరఫరా, పవర్ స్టేషన్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూ.262 కోట్లు మంజూరు చేశామని, ఈ నెలాఖరులోగా పవర్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

శిక్షణ శిబిరాల్లో ప్రతిభ చాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ప్రతిభను చాటాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వచ్చేనెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి శిబిరాలను గురువారం జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ అందజేసి వారిని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దాలని కోరారు. డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 10, అర్బన్ ప్రాంతాల్లో 21 చోట్ల వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, జగన్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

7న ఇసుక వేలం

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామ శివారు పిల్లి వాగులో అక్రమంగా డంపు చేసిన 105 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక వేలం నిర్వహిస్తామని తహసీల్దార్ సుగుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇసుకను గత నెల 21న పరిశీలించి సీజ్ చేశామన్నారు. కలెక్టర్ సూచన మేరకు ఒక్కో ట్రిప్పుకు ప్రభుత్వం ధర రూ.1,800 చెల్లించాలని ఆమె చెప్పారు. వేలంలో ఎక్కువ మంది పాల్గొంటే ఎక్కువ ధర ఎవరు చెల్లిస్తారో వారికే ఇసుక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 7న ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

4న రామస్వామి స్మారక పురస్కారం

కందనూలు: కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం 2024 కథ రచయిత్రి శ్రీ ఊహ 'బల్కావ్'(బ్యాక్ ప్యాక్ కథల సంపుటి)కు 4న ప్రధానం చేస్తున్నామని నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పి.వహీద్ ఖాన్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిసంవత్సరం సాహిత్యంలో గెలుపొందిన కవులకు అందచేస్తున్న సందర్భంగా 2024లో వచ్చిన కథల సంపుటాలను పరిశీలించి, కథారచయిత్రి శ్రీ ఊహకు రామస్వామి స్మారక జాతీయ పురస్కారానికి ఎంపిక చేశామని తెలిపారు. ఆదివారం సింగిల్ విండో సమావేశ మందిరంలో జరిగే సభకు ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు ప్రజాకవి గోరటి వెంకన్న హాజరవుతారని, ఈ సభకు కవులు, కళాకారులు, రచయితలు, సాహితీ మిత్రులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏళ్లుగా.. అచేతనంగా!

చేనేత పార్కు ఏర్పాటుపై ముందడుగు పడని వైనం

- నిధులున్నా పట్టించుకోని అధికారులు
- రూ.11లక్షలు ఖర్చు చేసినట్లు అధికారుల కాకిలెక్కలు
- మట్టి మాఫియాకు కాసుల వర్షం కురిపిస్తున్న పార్కుకు కేటాయించిన స్థలం



గద్వాల మండలం పూడూరు శివారులో చేనేత పార్కు స్థలం

గద్వాల: గద్వాల చేనేతకు దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతలు ఉన్నాయి.. అంతటి ప్రాశస్త్యం ఉన్న చేనేతను గడచిన దశాబ్దంన్నర కాలంగా పాలకులు, అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ గద్వాల చేనేత అంతరించిపోయేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. 2008లో చేనేత పార్కును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరీ చేశారు. అనంతరం వచ్చిన ప్రభుత్వ పెద్దలు దానిని గాలికొదిలేయడంతో 17ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అన్న చందంగా గద్వాలకు చేనేత పార్కు పరిస్థితి మారింది. 2009లో గ్లోబల్ లయన్స్‌కేషన్ (జీఐ) గుర్తింపు సైతం సాధించుకున్న గద్వాల చేనేత కాలక్రమంలో మసకబారే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే గద్వాల చీరల పేరిట బెంగుళూరు, పూణే వంటి నగరాల నుంచి పెద్ద ఎత్తున పవర్‌లూం యంత్రాలతో తయారు చేసిన నకిలీ గద్వాల చీరలను మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో ఒరిజినల్ గద్వాల చేనేత చీరలు కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది.

చేనేతకు ఊతమిచ్చేందుకు..

గద్వాల చేనేతకు ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకున్న 2008లో అప్పటి ప్రభుత్వ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గద్వాలకు చేనేత పార్కును మంజూరీ చేశారు. అంతేకాకుండా పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలం, నిధులు సైతం కేటాయించారు. గద్వాల మండలం పూడూరు శివారులోని సర్వే నంబర్ 368లో 50 ఎకరాల స్థలం, ఈ స్థలం అభివృద్ధి కోసం రూ.50లక్షల నిధులను మంజూరీ చేశారు. ఆ తర్వాత కాలంలో పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు విడుదల చేసిన రూ.50 లక్షల నిధులలో రూ.11లక్షలు ఖర్చు పెట్టినట్లు అధికారులు కాకిలెక్కలు చూపెడుతున్నారు. ఇందులో చేనేత పార్కుకు కేటాయించిన స్థలం చుట్టూ హద్దులు పెడుతూ దిమ్మెలు కట్టినట్లు, స్థలరక్షణకు ఓ సెక్యూరిటీ గార్డును నియమించినట్లు ఇందుకోసం రూ.8.50లక్షలు ఖర్చు అయినట్లు చెబుతుండగా, ఫొటోగ్రఫీ సర్వే చేసేందుకు రూ.2.50లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు కాగితాలపై కాకిలెక్కలు చూపెట్టి మింగేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని పాలకులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మంత్రులు కేటీఆర్, జూపల్లి కృష్ణారావు 2018 శాసన సభ ఎన్నికలకు ముందు చేనేత పార్కు స్థలానికి మరోసారి శంకుస్థాపన చేశారు. రూ.14కోట్లతో గద్వాల చేనేత పార్కును పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత పార్కు అభివృద్ధి గురించి పూర్తిగా మర్చిపోయారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలు చేశారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్కు అభివృద్ధి గురించి ఊసే ఎత్తడం లేదు.

మట్టిమాఫియాకు కాసుల వర్షం

ఇదిలా ఉంటే మరోవైపు చేనేత పార్కుకు కేటాయించిన స్థలంలో చాలా ప్రాంతం గుట్టలుగా ఉంది. ఈ గుట్టలు మట్టి మాఫియాకు వరంగా మారాయి. నిత్యం వందల లారీలలో మట్టిని అక్రమంగా తవ్వుతూ డబ్బులు వెనకేసుకుంటున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుల అనుచరులే మట్టిమాఫియా అవతారం ఎత్తిసొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇందులో రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖలోని కొందరు అవినీతి అధికారులను మచ్చిక చేసుకుని అక్రమంగా మట్టిదందాను యథేచ్చగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



చేనేత పార్కు స్థలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న మట్టిదందా

పార్కు ఏర్పాటు చేయాలి

చేనేత పార్కును త్వరగా ఏర్పాటు చేయాలి. దీనిద్వారా ప్రత్యేక్షంగా, పరోక్షంగా సుమారు 10వేల మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. అదేవిధంగా పార్కుకు కేటాయించిన స్థలంలో కొందరు మట్టిని అక్రమంగా తరలిస్తూ స్థలాన్ని నాశనం చేస్తున్నారు. స్థలాన్ని కాపాడి రక్షణ చర్యలు చేపట్టాలి.

– రాంలింగేశ్వర్‌కాష్మీ, గద్వాల చేనేత క్లస్టర్ చైర్మన్

నివేదిక పంపించాం

పార్కుకు కేటాయించిన స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.2.40కోట్లతో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ఇంజినీరింగ్ అధికారుల ద్వారా చేపడుతాం. అదేవిధంగా రూ.50లక్షలలో రూ.8.50లక్షలు ఏపీఐసీసీ వాళ్ల దిమ్మెల ఏర్పాటు, సెక్యూరిటీ గార్డు ఏర్పాటుకు వెచ్చించారు. రెవెన్యూ శాఖ వారు ఫొటోగ్రఫి సర్వే చేయగా ఇందుకు రూ.2.50లక్షలు ఖర్చు చేశారు. ఈనిధులను రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖర్చు చేయడం జరిగింది. మట్టిదందాపై ఇదివరకే పోలీసులకు ఫిర్యాదు చేశాం. కాంపౌండ్ వాల్ నిర్మాణం చేస్తే పూర్తిస్థాయిలో రక్షణ కల్పించవచ్చు. – గోవిందప్ప, ఏడీ చేనేత శాఖగద్వాల

క్లుప్తంగా

అప్పులబాధ భరించలేక వ్యక్తి బలన్మరణం

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి కాలనీలో వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి వీధిలో నివాసం ఉంటున్న వరదాచారి (45) వృత్తి గోల్డ్‌స్మిత్ తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి షేరు మార్కెట్లో పెట్టుబడి పెట్టాడు. అందులో నష్టాలు వచ్చి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారు ఫోన్‌చేసి అడగడంతో మదపడుతుండేవాడు. అతని భార్య 15 రోజుల క్రితం తల్లిగారి ఇంటికి మహబూబ్‌నగర్‌కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటి యజమాని చూసి భార్యకు ఫోను చేసి చెప్పడంతో ఆమె వెంటనే వనపర్తిలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు వచ్చి పోలీసుల సహాయంతో ఇంటి తలుపులు బద్దలు కొట్టి కిందికి దించారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతని భార్య కపిలవాయి మీనాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాడూరు: ఉరేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సిర్సవాడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రమేష్(30)మంగలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన ఇంట్లో నిద్రిస్తున్న రమేష్‌ను లేపడానికి వెళ్లిన నాయనమ్మకు చున్నీతో ఉరేసుకొని విగత జీవిగా కనిపించాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమేష్ మృతిపై అతడి నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్దకల్: నేలపై పడిన విద్యుత్ తీగ కాలుకు తగిలి వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం మల్దకల్ మండలం మేకలసోంపల్లి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మేకలసోంపల్లి గ్రామానికి చెందిన కుర్వ పండ్ల రాముడు (54) తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ కాలుకి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు నెరవేర్చాలి

- న్యాయ సలహాలు ఉచితంగా పొందవచ్చు
- న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ జడ్జి ఇందిర



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

జడ్చర్ల టౌన్: హక్కుల కోసం పోరాడి సాధించుకోవడంతో పాటు బాధ్యతలను సైతం సమర్థవంతంగా నెరవేర్చాలని, అప్పుడే సమాజం బాగుంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ జడ్జి ఇందిర పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కళాభవన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. కార్మికులకోసం ప్రత్యేక కోర్టులున్నాయని, అన్ని సమస్యలు అక్కడ పరిష్కారం అవుతాయని ఊహించరాదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులు చట్టాల గూర్చి తెలుసుకోవచ్చన్నారు. సామాజిక భద్రత లేకపోయిన, పనిచేసేచోట సరైన సౌకర్యాలు లేకపోయినా ప్రశ్నించాలన్నారు. హక్కులను పొందేందుకు అవసరమైన సలహాలను న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా పొందవచ్చన్నారు. సమాన పనికి సమానవేతనం, లింగ వివక్షత లేకుండా చూడటం, కనీస వేతనం లాంటి హక్కులు కార్మికులు పొందవచ్చన్నారు. అందరు బాగుంటేనే సమాజం బాగుపడుతుందన్నారు. చిన్న పిల్లల సమస్యలు చాలా వస్తున్నాయని, వాటిని బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అలాంటి సమస్యలకోసం ప్రత్యేక యూనిట్ ఉందని, మా వ్యక్తులకు సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. పారా లీగల్ వలంటీర్లు ఉన్నారని, క్షేత్రస్థాయిలో వారిని సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్, రైతుసంఘం నాయకుడు ఏ.రాములు, సీఐటీయూ సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, న్యాయవాదులు విశ్వేశ్వర్, సాహితిరెడ్డి, పాండు, కరీం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, పారా వలంటీర్ ప్రభావతి, కోర్టు సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర

- జిల్లాలో 12 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 4,454 మంది అభ్యర్థులు
- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో నీట్ యూజీ–2025 ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. నీట్ యూజీ పరీక్ష నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 12 కేంద్రాలను ఏర్పాటు చేశామని.. 4,454 మంది అభ్యర్థులు హాజరవుతారని వివరించారు.

- నీట్ పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని.. పరీక్ష నిర్వహించే రోజు పోలీసు బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు బయోమెట్రిక్ విధానం ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని.. ఎక్కడ ఎలాంటి తప్పులు జరగకుండా పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందే వెళ్లి చూసుకోవాలని తెలిపారు. అడ్మిట్ కార్డులో లొకేషన్ తో సహా ముద్రిస్తారని.. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నీట్ నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు ఉన్నారు.

అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు..

- అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.
- మధ్యాహ్నం 1:30 తర్వాత ఎవరిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు అన్నింటినీ తూ.చ తప్పకుండా పాటించాలి.
- ముఖ్యంగా అభ్యర్థులు ఆభరణాలు, భారీ దుస్తులు, బూట్లు ధరించి రాకూడదు.
- అభ్యర్థులు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు రెండు, నాలుగు లేదా ఆరు పోస్ట్‌కార్డు సైజు కలర్ ఫొటోతో రావాలి.
- గుర్తింపు కోసం డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు లేదా కళాశాల జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా ఇతర ఏదో ఒక ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలి.
- పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.
- జామెట్రిక్ బాక్సులు, మొబైల్ ఫోన్, బ్లూటూత్, వాలెట్, రిస్ట్ వాచ్, కెమెరా, బెల్టు, గూగుల్స్, ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్, పెన్, స్కేల్, రైటింగ్ ప్యాడ్, లాగ్ టేబుల్, క్యాలిక్యులేటర్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరగదు.
- పెన్ను పరీక్ష కేంద్రంలోనే ఇవ్వడం జరుగుతుంది.

పరీక్ష కేంద్రాలు ఇవే..

- ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, మహబూబ్‌నగర్
- పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మహబూబ్‌నగర్
- ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్
- పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల అండ్ సైన్స్ బ్లాక్
- డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల
- తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబ్‌నగర్
- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్
- తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ కళాశాల, మహబూబ్‌నగర్
- ప్రభుత్వ మోడల్ బేసిక్ హైస్కూల్, మహబూబ్‌నగర్
- ఎంజేపీటీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల), మహబూబ్‌నగర్
- టీజీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాల, రామి రెడ్డిగూడెం

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత క్రికెట్ శిబిరాలు

- ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల శిక్షణ శిబిరాలు
- ఈ నెల 6 నుంచి నెల రోజుల పాటు నిర్వహణ
- ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలో ఈనెల 6 నుంచి జూన్ 5 వరకు వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ బిరాలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ వెల్లడించారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎండీసీఏ మైదానం, గద్వాలలోని మినీ స్టేడియం, జడ్చర్లలోని డీఎస్‌ఏ మైదానం, నారాయణపేటలోని మినీ స్టేడియం, నాగర్‌కర్నూల్ నల్లవెల్లి రోడ్డులోని క్రికెట్ అకాడమీలో వేసవి శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఈ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణ అందజేస్తారని, అదేవిధంగా క్రీడాకారుల కోసం మ్యాట్‌లు, నెట్‌లతో పాటు జంబో కిట్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కోచింగ్ ఉంటుందని, క్రీడాకారులకు అల్పాహారం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల 9 ఏళ్ల నుంచి అండర్–23 ఏళ్ల లోపు క్రీడాకారులు వచ్చేనెల 6వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

- వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో ఈనెల 12 నుంచి ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ నిర్వహించి, ఇందులో రాణించిన క్రీడాకారులను వచ్చేనెలలో హెచ్‌సీఏ టూలీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. గతేడాది లాగే ఈసారి కూడా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాలను ఔత్సాహిక క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాన్ని చాటుకోవాలని సూచించారు. సమావేశంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడాలి

ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



ధరూరులో మాట్లాడుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ధరూరు: శ్రమ జీవులకు ఆయువు పట్టు కార్మిక చట్టాలని, అదే చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో జరిగిన 139వ మేడే వేడుకల్లో ఆయన మాట్లాడారు. దేశంలో 140 కోట్ల జనాభా, అందులో ప్రధానంగా 80 శాతం మంది కార్మికులే ఉన్నారన్నారు. శ్రమజీవులలో 47 కోట్ల మందిలో కార్మిక వర్గంలో కేవలం 7 కోట్ల కార్మికులకు మాత్రమే ఉద్యోగ, సాంఘీక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమ జీవులకు తగిన భద్రత, సరైన వేతనాలు లేవన్నారు. అనంతరం టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడారు. జూరాల మిషన్ భగీరథ ప్లాంటు వద్ద చింతరేవుల ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో వెంకటేష్, అశోక్, రవి, శ్రీనివాస్, శ్రీను, కిష్టన్న, జయరాం, శేఖర్‌బాబు, రంగన్న, ఎం రవి, తదితరులు పాల్గొన్నారు.

యువతి దారుణ హత్య



ఘటనా స్థలంలో గీతాంజలి మృతదేహం



నిందితుడు శ్రీరాంనరేష్

- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- సహజీవనంలో మనస్పర్థలే కారణం

నవాబుపేట: భార్యను వదిలేసిన వ్యక్తి.. భర్తను వదిలేసిన మహిళ ఇద్దరు కలిసి రెండేళ్ల పాటు సహజీవనం చేశారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ.. సదరు మహిళ అతడి చేతిలో దారుణ హత్యకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. నవాబుపేట మండలం కొల్లూర్‌కు చెందిన శ్రీరాంనరేష్‌కు నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన స్వాతితో వివాహమైంది. వారికి కూతురు జన్మించిన తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో.. ఆమెను పట్టించుకోకుండా వదిలేశాడు. దీంతో స్వాతి హైదరాబాద్‌లోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి అతడు జడ్చర్లలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటూ.. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో భర్తను వదిలేసి జడ్చర్లలో ఒంటరిగా నివాసముంటున్న మల్లెబోయిన్‌పల్లికి చెందిన గీతాంజలి (23)తో శ్రీరాంనరేష్‌కు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇద్దరు రెండేళ్లపాటు సహజీవనం చేశారు. వారికి ఓ పాప సైతం జన్మించింది. అయితే కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో శ్రీరాంనరేష్ ఆమెను పట్టించుకోవడం మానేశాడు. ఈ క్రమంలో గతనెల 29న గీతాంజలి కొల్లూర్‌కు వచ్చి శ్రీరాంనరేష్‌పై పంచాయితీ పెట్టాలని నిర్ణయించింది. ఇందుకు ఆమె తన తల్లిని సైతం తీసుకుని వచ్చింది. కాగా, రెండు రోజుల్లో మాట్లాడతామని గ్రామ పెద్దలు చెప్పారు. దీంతో బుధవారం గీతాంజలిని ఇంటి వద్ద దించుతానని శ్రీరాంనరేష్ నమ్మించి తన బైక్‌పై ఎక్కించుకుని కొల్లూర్ నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలోని కాకర్జాల గ్రామ సమీపంలో నిర్మానుష్య ప్రదేశానికి ఆమెను తీసుకెళ్లి కత్తితో పొడిచి, చున్నీతో గొంతు బిగించి హతమార్చాడు. అర్ధరాత్రి తర్వాత అతడే పోలీసులకు ఫోన్ ద్వారా హత్య సమాచారం అందించి స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

మిడ్జిల్: ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామానికి చెందిన బోయిని భూదేవిని 2007లో నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మరికల్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. పదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి అత్తగారి ఇంట్లో ఉంటుంది. తరచూ తల్లిగారి ఇంటికి వచ్చిపోతుండగా.. ఈ నెల 30వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు దోనూర్‌కు వచ్చి తండ్రితో గొడవ పడి వెళ్లిపోయిందని, ఆ తర్వాత ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం రాత్రి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొండి మొక్కలు.. పొదల నిర్మూలన





ముళ్ల పొదలు, పొలం గట్టుపై ముళ్ల పొదలు, మొండి మొక్కలు

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: పొలాల గట్లు, ఖాళీ భూమిలో మొండి మొక్కలు, పొదలు పెరిగి రైతులకు తీరని నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి నిర్మూలన రైతులకు శ్రమతో పాటు ఖర్చుతో కూడినది. వీటిని వేర్లతో సహా పెకిలించాలి.. నరికి వదిలేస్తే మళ్లీ చిగురించి పిలకలు వేస్తాయి. కాబట్టి వీటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ రైతులకు వివరించారు.

పిచికారీ విధానం..

తుమ్మ, అడవిరేగు, సర్కార్ తుమ్మ గుబురుగా పెరుగుతాయి. వీటిని నిర్మూలించడానికి 24–డి ఎమైన్ సాల్ట్‌ను 58 శాతం ద్రావణం లేదా 24–డి ఇథైల్ ఎస్టర్ 36 శాతం ద్రావణం ఒక లీటర్ నీటికి 5 మి.లీ. కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. ఇవేగాక గ్లైఫోసేట్ మందును లీటరు నీటికి 10 మి.లీ., అమ్మోనియం సల్ఫేట్‌తో కలిపి పిచికారీ చేయాలి. మందు ఆకుల ద్వారా మొక్కల వేర్లలోకి ప్రవేశించి చంపేస్తాయి.

వేరు ద్వారా రసం పీల్చే విధానం..

ఈ విధానంలో తొలగించాల్సిన మొక్క పక్కన కొంచెం తవ్వి చూపుడు వేలు మందం ఉన్న ఒక వేరును ఏటవాలుగా కత్తిరించాలి. ఒక పాలిథీన్ సంచిని తీసుకొని అందులో 10 మి.లీ. గ్లైఫోసేట్ మందు 10 మి.లీ. నీరు కలిపిన మిశ్రమం పోసి వేరు కొన అంచులో మునిగేటట్లు ఉంచి సంచిని ద్రావణంతో కట్టి 24 గంటలు అలానే ఉంచాలి. దీంతో వేరు ద్వారా మందు ద్రావణం చెట్టంతా ప్రవేశించి చనిపోతుంది. ఈ పద్ధతిలో అడవి రేగు, జిల్లేడు వంటి చెట్లను చంపవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చెట్టు నరికిన వెంటనే లేదా బెరడు తొలగించిన వెంటనే మందు మిశ్రమాన్ని వాడాలి.
- మొక్కలు బాగా పెరిగే దశలో రసాయనాలు పిచికారీ చేయాలి.
- వాతావరణం పొడిగా ఉన్న సమయాల్లో మాత్రమే కలుపు మందులు వాడాలి.
- గాలి తక్కువగా వీచే సమయాల్లోనే మాత్రమే పిచికారీ చేయాలి.
- కలుపుమందు పిచికారీ చేసేటప్పుడు చుట్టుపక్కల ఇతర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నప్పుడు జాగ్రత్తగా వినియోగించాలని. లేకపోతే గాలి ద్వారా పక్క పంటలపై పడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

బెరడు తీసి మందు వాడే పద్ధతి..

పెద్ద చెట్లకు బెరడు ఉంటుంది. ఇలాంటి చెట్లలో భూ మట్టం నుంచి ఒక మీటరు ఎత్తులో చెట్టు చుట్టూ ఉన్న బెరడును కత్తితో కోసి ఆ ప్రదేశంలో రసాయనాన్ని కలపడం, పోయడంతో లేదా బ్రష్‌తో పూయడం గాని చేయాలి. ఈ పద్ధతిలో 24 డి ఎమైన్ లేదా 24 డి ఇథైల్ ఎస్టర్ లేదా గ్లైఫోసేట్ మందులో ఒక పాలు, నాలుగు పాళ్ల నీటిలో కలపాలి. అవసరమైతే ఈ పద్ధతులు నెల రోజుల తర్వాత పాటించాలి.

అత్యాచారం కేసులో జైలుశిక్ష

- రూ.25వేల జరిమానా
- నాలుగేళ్ల తర్వాత నిందితుడికి పడిన శిక్ష



నిందితుడు చెన్నయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొత్తకోట రూరల్: రాత్రి ఇంటి ముందు నిద్రిస్తున్న మైనర్ బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసిన కేసులో 4 ఏళ్ల తర్వాత నేరం రుజువవ్వడంతో వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్. సునీత నేరస్తుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రావుల గిరిధర్ గురువారం తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు.. 2021 మే 18న వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో బాలిక కుటుంబ సభ్యులు దినకార్యాల అనంతరం కానాయిపల్లి శివారులోని శివాలయంలో నిద్ర చేసేందుకు వెళ్లగా.. అదేరోజు రాత్రి బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు పడుకుంది. ఈ నేపథ్యంలో నిందితుడు చెన్నయ్య నిద్రపోతున్న బాలిక నోట్లో చున్నీ పెట్టి తన ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక బంధువులు వెతుకుతుండగా భయంతో వదిలిపెట్టి నిందితుడు పారిపోయినట్లు పేర్కొన్నారు. బాధితురాలు కొత్తకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి కొత్తకోట ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మల్లికార్జున్‌రెడ్డి ఘటన జరిగిన ప్రాంతం, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరించి నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. సీఐ రాంబాబు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం నిరూపణ కావడంతో గురువారం శిక్ష విధించినట్లు ఎస్పీ వెల్లడించారు. బాధితురాలు మదనాపురం మండల కేంద్రంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ 8వ తరగతి చదువుతుండేదని పేర్కొన్నారు.

రైతుల కష్టాలు అధికారులకు పట్టవా..?

- ధాన్యం దింపుకోవడంలో మిల్లర్ల కాలయాపన
- ఆగ్రహించిన రైతులు.. జాతీయ రహదారిపై ధర్నా
- మాగనూర్, మరికల్‌లో రైతుల నిరసన



మాగనూర్ మండలం వడ్వాట్ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు



మరికల్ మండలం కన్మనూర్ మిల్లు ఎదుట ఆందోళనకు దిగిన రైతులు

మాగనూర్: ఆరుగాలం కష్టపడి వరి పంట పండించామని.. కానీ, దానిని విక్రయించేందుకు సైతం మరిన్ని అవస్థలు పడాల్సిన పరిస్థితి దాపురించిందని, మా కష్టాలు అధికారులకు పట్టవా అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మాగనూరు మండలంలోని వైష్ణవి మిల్లు యాజమాన్యం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోపాటు క్వాంటిటీ ముగిసిందని చెప్పి ఇబ్బందులకు గురిచేయడం, తరుగు పేరుతో 3 కిలోల వరకు తీసేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాగనూర్ మండల కేంద్రంలోని వడ్వాట్ క్రాస్ రోడ్డు దగ్గర ఎన్‌హెచ్–167 పై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చివరి గింజ వరకు బోనస్ ఇచ్చి మరి కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మారాయని అన్నారు. ఒక్కవైపు సమయానికి గన్నీ బ్యాగులు, లారీలు అందక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ మిల్లర్ల మోసానికి బలి అవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు గంటపాటు ఆందోళన చేపట్టడంతో విషయం తెలుసుకున్న పీఏసీఎస్ సీఈవో అంజనేయులు, మండల ఇన్‌చార్జ్ ఏఓ సుదర్శన్‌గౌడ్, మక్తల్ సీఐ రాంలాల్ అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మిల్లుల క్వాంటిటీ పెంచే విధంగా చూసి రైతులకు ఇబ్బందులు కలగుండా చుట్టుపక్కల మిల్లుల వారు ధాన్యాన్ని సేకరించేలా చూడాలని తెలిపారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. అధికారులు స్వయంగా మిల్లు దగ్గరకు వెళ్లి రైతుల ధాన్యాన్ని దింపించారు. ధర్నా కారణంగా గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది.

ధాన్యం అన్‌లోడ్ చేసే వరకు కదలం..

మరికల్: మిల్లు వద్ద మూడు రోజులుగా ధాన్యంతో ఎదురుచూస్తున్నామని.. తీరా ఇప్పుడు మా మిల్లు కు కేటాయించిన ధాన్యం టార్గెట్ పూర్తి అయ్యిందని.. మేం అన్‌లోడ్ చేసుకోమని అంటే ఎలా అంటూ రైతులు ఆందోళనకు దిగారు. గురువారం మరికల్ మండలం కన్మనూర్ మిల్లు వద్ద నిరసన చేపట్టారు. మూడు రోజుల క్రితం ఎక్లాస్‌పూర్, జిన్నారం, బూడ్యాగానితండా, చిత్తనూర్ గ్రామాల నుంచి 60కి పైగా ట్రాక్టర్ల ధాన్యం కన్మనూర్ మిల్లుకు తీసుకురావడం జరిగిందన్నారు. వరుస క్రమంలో వచ్చిన ట్రాక్టర్లకు టోకన్లు కూడా ఇచ్చారని, ఇప్పుడు దించుకోమని చెప్పడంతో తమ పరిస్థితి ఏంటని రైతు లు అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మిల్లు యాజమానితో మాట్లాడగా సివిల్ సప్లయ్ అధికారులు తమ మిల్లుకు కేటాయించిన టార్గెట్ పూర్తి కావడంతో ధాన్యం దించుకోవద్దని ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో అగ్రహించిన రైతులు ట్రాక్టర్ల నుంచి ధాన్యం దించుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆందోళనకు దిగారు. ఇక్కడ మూడు రో జులు పాటు వేచి చూసి కాదు పొమ్మంటే ఎలా అంటూ ప్రశ్నించారు. మరో మిల్లుకు ధాన్యం తరలించే ప్రసక్తేలేదని వారు తేల్చి చెప్పారు. అధికారులు చెబితే టోకెన్లు ఇచ్చిన ట్రాక్టర్ల వరకు ధాన్యం దించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, అంతకు మించి తాము ఏం చేయలేమని రైతులకు మిల్లర్లు వివరించారు. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.